## కథ

# మంచు కడిగిన ముత్యం

వాలి హిరణ్మయీదేవి

**"ఊ...ఇదుగోండి కాఫీ. ఏమిటి పేపర్ విశేషాలు" అంటూ భర్త రాఘవకి కాఫీ అందించి తనూ ఓ కప్పు కాఫీ తెచ్చుకొని అతని పక్కన కూర్చుంది సుశీల.**

**పొద్దుట అలా కాఫీ తాగుతూ ఓ అరగంట అవీఇవీ మాట్లాడాకే, ఆమె వంటపని మొదలెట్టడం గత ముప్ఫై ఏళ్లుగా అలవాటామెకి.**

"ఏమున్నాయ్. హత్యలూ దోపిడీలు మానభంగాలు.. ఎప్పుడూ ఉండేవే" అన్నాడతను కాస్త విసుగ్గా పేపర్ని అవతలపెడుతూ.

"నిజమే. ఇలాంటి వార్తలు చదివితే మనసంతా వికలమయిపోతూ ఉంటుంది. అదిసరేగానీ ఈ పూట ఏ కూరలు చేయమంటారో చెప్పండి" అంది సుశీల.

"నువ్వు పచ్చగడ్డితో పచ్చడి చేసినా బావుంటుంది. ఎప్పుడూ నా ఇష్టాలేనా నీకేది వీలుగా ఉంటే అది నీకేది నచ్చితే అది చేసెయ్" అన్నాడామె వంక నవ్వుతూ చూస్తూ.

"కొత్తగా ఇదేంటి?" భర్త చూపులకు సిగ్గుపడుతూనే అంది సుశీల.

"పిచ్చి సుశీ! ఎంతసేపూ నా ఇష్టానికే ప్రాధాన్యత ఇస్తావేం? ప్రతీదీ నన్నడిగే చేయాలా? అనుకూలవతియైన భార్య, వినయవిధేయతలున్న పిల్లలూ ఉన్న నన్ను మించిన అదృష్టవంతుడెవరున్నారానిపిస్తూ ఉంటుంది అప్పుడప్పుడు" అన్నాడతను.

"పిల్లలంటే గుర్తొచ్చింది. రామానికి వచ్చే నెల్లో సెలవు దొరకవచ్చుట. అప్పుడు వస్తానని ఫోన్ చేసి చెప్పాడు. మొదటి నెల జీతం అందుకొన్నాడట. మనకి బట్టలు కొని కొరియర్‌లో పంపాడట. బహుశా రేపు అవి అందుతాయి. వాడు మనల్ని చాలా మిస్ అవుతున్నానని ఒకటే బాధ పడ్డాడు. నాకూ దుఃఖంలో గొంతు పెగల్లేదు" అంది సుశీల.

"మనకి వాడు బట్టలెందుకు తీసుకున్నాడు. కొత్తచోటు కదా వాడి దగ్గర నాల్గు డబ్బులుంచుకోవాలి గానీ" అన్నాడు రాఘవరావు. కానీ మనసులో మురిపెంగానే అనిపించింది.

మనం నాటిన చిన్నమొక్క పెద్దదై పుష్పించి ఫలిస్తే కలిగే ఆనందాన్ని వర్ణించడానికి పదాలు ఉంటాయా?

"అవునూ.. చిట్టితల్లింకా రాలేదేంటి? ఈపాటికి వచ్చి తనకీ కాఫీ కావాలని గొడవ పెట్టేదిగా" అడిగాడు రాఘవరావు. అతనికా పిల్లంటే పంచప్రాణాలు.

"వాళ్ల స్కూల్లో ఎక్స్‌కర్షన్‌కి తీసుకువెడుతున్నారట. నాల్రోజులుండాలట అక్కడ బట్టలవీ సర్దుకొంటోంది కాబోలు. లేకుంటే వచ్చి ఇక్కడే తిష్ట వేసి మళ్లీ వాళ్ల మ్మొచ్చి పిలిచేంతవరకూ వెళ్లేదికాదుగా" అంది సుశీల.

"ఏంటీ నాల్రోజుల పాటు ఎక్స్‌కర్షనా? అనంతానికి మతిలేదేంటి? అన్ని రోజులు పిల్లను విడిచి ఎలా ఉంటామని పంపుతున్నాడసలు" అన్నాడు రాఘవ కాస్త కోపంగా.

"ఇది మరీ బావుంది. మనం వదిలి ఉండలేమని పిల్ల అచ్చటాముచ్చటా తీర్చకుంటే ఎలా? అదేమో తిండి మానేసి మరీ వెడతానని ఒకటే ఏడ్పు"

ఏడ్పు అన్నమాట వినగానే శాంతిస్తూ "అలాగా అందుకోసం పిల్లనంతగా ఏడ్పించాలేంటి?" అంటూ చిరాకు పడ్డాడు.

నవ్వేసింది సుశీల. తమకి ఆడపిల్లలు లేనందుకూ. పుట్టిందగ్గర్నుండీ ఆ పిల్ల తమ దగ్గరే ఎక్కువ భాగం పెరిగినందుకూ ఏమో చిట్టితల్లంటే చాలా ప్రాణం రాఘవకి. తామంతా అప్పుడప్పుడైనా "అపురూపా" అంటూ పిలుస్తారుగానీ రాఘవ నోట చిట్టితల్లన్న పిలుపు తప్ప మరోటి రాదు. ప్రతీ పండగకి తన పిల్లలతో పాటూ అపురూపకి బట్టలు కొంటుంటారు. ఆ పిల్లకి వాళ్ల నాన్న దగ్గరకన్నా రాఘవ దగ్గరే బాగా చనువు.

"పిల్లలన్నాక నవ్వకుండా ఏడవకుండా ఉంటారేంటండి బాబూ! అయినా పరాయిపిల్ల మీద అంత మమకారం పెంచుకోకూడదు"

"అబ్బా! పరాయి అంటూ మాట్లాడకు. మన చిన్నాడి తర్వాతో పాప పుట్టి ఉంటే అంతే ఉండేది కదూ" అన్నాడతను.

"నిజమే. ఆడపిల్ల కావాలంటూ నన్ను ముగ్గురు మగపిల్లలు తల్లిని చేసేశారుగా. ఇద్దరు చాలంటున్నా వినకుండా" అంది సుశీల.

ఇంతలో అపురూప పరుగున రావడం చూసి, "ఇక మీ తండ్రీకూతుళ్లు మాట్లాడుకోండి. నాకు వంటింట్లో పని ఉంది" అంటూ లోపలకి వెళ్లిపోయింది.

★ ★ ★

కాఫీ పొడి ఫిల్టర్‌లోవేసి రాఘవరావు రాక కోసం ఎదురుచూస్తూ కూర్చుంది సుశీల. తలుపు చప్పుడవ్వడంతో వచ్చింది రాఘవే అనుకుంటూ తలుపు తీసిన సుశీల ఎదురుగా నిలబడి ఉన్న వృద్ధుణ్ని చూస్తూ "నువ్వా యాదగిరి. బాగున్నావా?" అనడిగింది.

"బాగున్న బిడ్డా. అందరు మంచిగున్నం తల్లీ" అంటూ కూర్చున్నాడు.

"కొంచెం టీ ఇవ్వనా లేదా కాఫీ ఇవ్వనా" అడిగింది సుశీల తనకి మంచినీళ్లు అందిస్తూ.

"చాయ్ పోయ్ తల్లి. పిల్లలంతా పెద్దోళ్ళైపోయింరు కదా" అన్నాడతను.

"అవును పెద్దవాళ్లయిన ఇద్దరి చదువులు అయిపోయాయ్. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలిన వాడి చదువు ఈ ఏటితో అయిపోతుంది" అందామె.

అతడు "అమ్మా! ఒక ముచ్చట చెప్పాలి అయ్య లేడు కద ఇంట" అన్నాడటూ ఇటూ చూస్తూ.

"చిన్నవాడు సునంద్ హాస్టల్‌లో ఉంటున్నాడు లేడిక్కడ. మీ అయ్యగారు ఆఫీస్ నుండి ఇంకా రాలేదు కానీ విషయం ఏమిటో చెప్పు" అంటూ అడిగింది.

"రామం ఏడ్నుండు తల్లి?" అడిగాడు యాదగిరి.

"రామంకి బెంగుళూర్లో జాబ్ దొరికింది. అక్కడే ఉన్నాడు. వచ్చే నెల్లో వస్తాడ్లే. వాడు లేక మాకైతే చాలా బెంగగా ఉంది సుమా" అందామె.

"ఎందుకుండదమ్మా. రగత సమ్మందం కదా" అన్నాడతను కళ్లు తుడుచుకుంటూ.

ఉలిక్కి పడింది సుశీల. అనుమానంగానే కంపితస్వరంతో అడిగింది "ఏమన్నావ్" అంటూ.

"అమ్మా! మీరు పెద్ద మనసు చేసుకుని నన్ను చమించాలె" అంటూ ఆమె కాళ్లు పట్టుకోబోయాడు.

అతడిని వారిస్తూ "ఏంటిది. ఎందుకు క్షమించాలి? ఏంటో వివరంగా చెప్పు?" అంది సుశీల దడదడలాడుతున్న గుండెలతో.

"అమ్మా! అపుడు మీ తొలి పెసవం అయినప్పుడు చచ్చిపోయిన పిలగాడు పుట్టిండని చెప్పినం గద. అది అబద్ధం. ఆ పిలగాడే మన రామంబాబు. ఆ పిలగాణ్ణి ఏడనన్న అనాథాశ్రమంలో షరీక్ చెయ్యమని మీ నాయన పైసలిచ్చిండు. ఎవరికి చెప్పొద్దని ఒట్టేయించుకొన్నాడు. నాకు మస్తు పైసలు గూడ ఇచ్చిండు. నల్గురు

ఆడపిల్లలున్న మా యాడది ఆ పిలగాణ్ణి మనమే పెంచుకుందాం అంటే సరేనన్న. వాణ్ణి తీసుకొని మేమంతా వేరే ఊరికి పోయినం. వాడిని మేమే పెంచినం. జర పెద్దగైనంక పన్లో పెట్టినం. తర్వాతెప్పుడో కొన్ని ఏళ్లయినంక నిన్ను చూసిన. నువ్వు, 'పిల్లలతో పని చేసుకోలేకపోతున్నా. ఓ పనిమనిషిని చూసిపెట్టు' అంటూ అడిగినవ్. చమించాలె. నువ్ బాగా పైసలిస్తా వని నీతాననే నీ పోరణ్ణి పనికి పెట్టిన నన్ను సెమించు తల్లి. మా యాడది పోయిన్నెలలో కాలం చేసింది. చచ్చె ముంగల 'అమ్మగోరికి నిజం చెప్పెయ్ మామా' అని మాట తీసుకున్నది. అందుకే చెబుతున్న. రామంబాబు నీ కొడుకేనమ్మా" అన్నాడు యాదగిరి.

లక్ష వోల్టుల షాక్ తిన్నట్లయిన సుశీలకు కళ్లు తిరి గాయ్. కుర్చీని గట్టిగా పట్టుకొంది. యాదగిరి వెళ్లిపోతూ ఉంటే మాటా పలుకూ లేకుండా శిలలా చూస్తూ ఉండి పోయింది.

రాఘవ ఎప్పుడు వచ్చాడోగానీ అతడు తమ సంభాష ణనంతా విన్నట్లు అసహ్యాన్ని నింపుకున్న అతడి కళ్లను చూసి గ్రహించి విలవిలలాడింది సుశీల.


"ఛీ ఎంత మోసం. పెళ్లికి ముందే ఇంత గ్రంథం నడి పావా? ఎంత నయవంచన. ఎంత నమ్మక ద్రోహం" ఇంకా ఏదో అనాలనుకున్నా అతడిని నిలువెల్లా ఊపే స్తున్న ఆగ్రహావేశాలు, మాటల్ని తడబడేలా చేస్తున్నాయ్.

"ఏవండీ! నా మాట నమ్మండి. నేనేం కావాలని కాని పని చేయలేదు. జరిగిందేదో పెళ్లికి ముందే చెప్పేస్తానంటే, అమ్మానాన్న చెప్పొద్దని వాళ్ల మీద ఒట్టేయించుకున్నారు" అంది ఎలాగో సుశీల.

ఆమె మాట పూర్తిగాకుండానే "ఒట్టేయించుకోగానే, నన్ను జీవితాంతం మోసం చేయడానికి సిద్ధపడిపో యావ్. ఆ ముసలోడి మాటలు నేను వినకుండా ఉంటే చచ్చేవరకూ గూడా నిజం చెప్పి ఉండేదానివి కాదు. పైకి మాత్రం ఎంత అణకువగా, అమాయకంగా కన్పిస్తావ్. ఈ పాపాలన్నీ పోగొట్టుకోవడానికేనా అనాథాశ్రమాలకి డొనేషన్లు ఇస్తూ ఉంటావ్. ఆ పిల్లలకు పళ్లు, స్వీట్లూ, బట్టలవీ పంచుతూ ఉంటావ్. అదంతా నీ విశాల హృద యమని భ్రమ పడినందుకు నన్ను నేను చెప్పులతో కొట్టుకోవాలి" అన్నాడతను ఆవేశంగా.

"ఏవండీ! ప్లీజ్ నన్ను మన్నించండి. నేనేం ఒళ్లు కొవ్వెక్కి తప్పు చేయలేదండి. ఒంటరిగా కాలేజ్ నుండి వస్తున్న నన్ను ఎవరో ఆగంతకులు రేప్ చేయడం వల్ల జరిగిన అనర్థం. దాన్ని కప్పిపుచ్చారు మా అమ్మానా న్నలు. అందరి తల్లిదండ్రుల్లాగే. అంతే తప్ప నేనే పాపమూ ఎరుగనండి" అంది కన్నీళ్లతో అతని పాదాల మీద పడబోతూ.

"ఛీ" అని చీత్కరిస్తూ బెడ్ రూమ్‌లోకెళ్లిపోయి కళ్లకు చెయ్యి అడ్డం పెట్టుకొని మంచం మీద వాలిపో యాడు. అతన్ని పలుకరించే సాహసం చేయలేకపోయింది సుశీల.



ఆ రాత్రి అతి భారంగా దీర్ఘంగా గడిచింది.

పొద్దుటే లేచి కాఫీ కలిపి పట్టుకెళ్లింది సుశీల. ఆ కప్పుని విసిరి కొట్టాడు రాఘవరావ్. కాస్సేపటికి మెల్లగా వెళ్లి ఉప్మా ప్లేటుని అందించింది. దానికీ అదేగతి పట్టింది. "నువ్ నా ముందుకు రాకు. నాకు పిచ్చెత్తించకు" అంటూ అరిచాడు. దాంతే మౌనంగా వెనుదిరిగి వచ్చేసింది. పిల్లలెవరూ ఇంట్లో లేకపోవడం నయమయింది అని అనుకోకుండా ఉండలేకపోయింది సుశీల.

'చిట్టితల్లి వచ్చినా కాస్త రిలాక్స్ అయ్యేవారేమో సమయానికి అది లేకుండా అయింది' అనుకొంది సుశీల.

స్నానం చేసి తయారై వెళ్లిపోయాడు రాఘవరావ్.

వంట చేయాలన్పించలేదు సుశీలకు. కాఫీ తాగింది నీరసానికి తట్టుకోలేక. ఇటు భర్త నిరాదరణ. అటు రామంని తాము పనిపిల్లాడిగా ట్రీట్ చేసిందీ గుర్తుకు వస్తున్నకొద్దీ సుశీలకు దుఃఖం ముంచుకు రాసాగింది.

'వాళ్లెవరో ఏంటో. తన మీద అఘాయిత్యం చేసి హాయిగా ఎక్కడ ఉన్నారో గానీ, తనిప్పుడు ఈ వయసులో నిరాదరణ పాలవుతున్నది. నోరు విప్పి తన పరిస్థితి ఇదీ అని ఎవరితోనూ చెప్పుకోలేదు. ఏడ్చి మనసును తేలిక చేసుకోలేకపోతున్నది. ఆమెకి రామం తమ ఇంట్లో చేరిన వైనం గుర్తుకు రాసాగింది.

"అమ్మా! మీకు పనికి మనుషులు కావాలంట గద అయ్య చెప్పిండు. వీడు మా పోరగాడు. అన్ని పనులు వచ్చు. మీరు చెప్పిన పనులన్నీ చిటికెల చేస్తాడు. మూడు నెల్లకోపాలి వత్తా. మీ దయ ఉన్నంత ఇయ్యండి. పిల్లలున్నోణ్ణి" అంటూ ఎనిమిదేళ్ల పిల్లాణ్ణి తీసుకుచ్చి అన్నాడు యాదగిరి. పిల్లవాణ్ణి పరీక్షగా చూసింది సుశీల. పోషణ సరిగ్గా లేక నీరసంగా కనిపిస్తున్నాడు. ఎనిమిదేళ్లంటే నమ్మేటట్లు లేడు. కళయిన ముఖమే అనుకుంటూ "మా పిల్లని చూసుకోగల్గితే చాల్లే. పిల్లలిద్దర్నీ చూసుకుంటూ పనులు చేసుకోవడం కష్టంగా ఉంది. పిల్లల్ని శ్రద్ధగా చూసుకుంటే చాలుగానీ వీడు పిల్లల్ని ఎత్తుకోగలడని అనుమానంగా ఉంది" అంది సుశీల.

"మా పిల్లల్ని వాడే ఎత్తుకుంటాడు. వాడికి అలవాటే నమ్మా" చెప్పాడు యాదగిరి.

"నీ పేరేంటి బాబూ!" అడిగింది సుశీల.

"రామం అమ్మా"

"ఒరె. అమ్మా అనొద్దు అమ్మగారూ అని పిలవాలె. అయ్యగోర్ని అయ్యగోరూ అనాల" రామం పిలుపును సరిచేస్తూ అన్నాడు యాదగిరి.

"ఫర్వాలేదులే. అమ్మా అని పిలవనియ్" అంది సుశీల నవ్వుతూ. నీట్‌గా నవ్వు మొహంతో కరుణ కురిపిస్తున్నట్లున్న కళ్లతో ఉన్న సుశీలను చూడగానే రామంకి ఎంతో సంతోషం కలిగింది. చీటికి మాటికి కోపంతో రంకెలు వేసే తల్లి గుర్తొచ్చి 'ఈయమ్మే ఛాలా బాగుంది. పిల్లలు రబ్బరుబొమ్మల్లా ముద్దుగా ఉన్నారు' అనుకొంటూ, తను ఇక మీదట ఇక్కడ ఇంత మంచి ఇంట్లో ఉండబోతున్నందుకు తన అదృష్టానికి తనకే సంతోషం కలిగింది రామంకి.

అలా ఇంట్లోకి చేరిన రామం అందరి తలలో నాలుకలా మారడానికి అట్టే కాలం పట్టలేదు.

"పొద్దుటే లేవగానే మొహం కడుక్కొని, స్నానం చేసెయ్" అంది సుశీల మొదటిరోజే. అంతే. మళ్లీ ఆ మాట చెప్పించుకోలేదు రామం. పొద్దుటే లేచి పాలు తీసుకొచ్చి మొహం కడుక్కొని స్నానం చేసి అమ్మగారిచ్చిన బట్టల్లోంచి ఓ జత వేసుకొని, అమ్మగారిలా తులసి కోటకి అయ్యగారిలా సూర్యుడికి దండం పెట్టేసుకొని, పిల్లల గదిలోకి వెళ్లిపోయేవాడు. వాళ్లు పడుకొని ఉంటే, సుశీలకు బియ్యం కడిగి ఇవ్వడం, కూరగాయలు తరిగివ్వడం పనిమనిషి తోమి వెళ్లిన గిన్నెల్ని మరోసారి కడిగి వంటింట్లో సర్దడం, అయ్యగారి షూస్ పాలిష్ చేసివ్వడం చేసేవాడు. "పిల్లవాడు వచ్చాక బాగా రిలాక్స్‌గా ఉంది కదూ. మునుపట్లా ఆదరాబాదరాగా కనిపించటం లేదు" అని రాఘవరావ్ అంటే సుశీల "నిజమేనండి. ప్రశాంతంగా పనులు చేసుకొంటున్నాను. పిల్లాడు చిన్నాడేగానీ మన పిల్లల్ని చాలా బాగా చూసుకొంటున్నాడు. ఇన్ని పనుల్లో సాయం చేస్తూ" అనేది.

అటు భర్త ఆఫీసుకి ఇటు వినోద్, ఆనంద్‌లు స్కూల్‌కి వెళ్లగానే ఏడాది వయసున్న సునంద్‌కి స్నానం చేయించి పడుకోబెట్టేది సుశీల. పనులన్నీ అయిపోయాక రామం చేతికి పలకాబలపం ఇచ్చి అక్షరాలు దిద్దమనేది సుశీల. రామం సూక్ష్మగ్రాహి. ఒక్కసారి చెబితే చాలు. ఇట్టే నేర్చేసుకొనేవాడు. ఆనంద్ చదువుకొంటుంటే అక్కడే నిలబడి శ్రద్ధగా గమనించేవాడు. ఆనంద్ చెప్పే రైమ్స్‌ని తనూ మననం చేసుకునే వాడు. అది చూసిన రాఘవరావ్ "వీడికి చదువంటే బాగా ఇంట్రెస్ట్ ఉంది. మనింటి పక్కనే గవర్నమెంట్ స్కూల్ ఉందిగా. అదీ ఒక్కపూట నడిచే స్కూల్ కాబట్టి మళ్లీ మూడు గంటలకల్లా ఇంట్లో ఉంటాడు" అంటూ స్కూల్లో చేర్పించాడు. గార్డియన్స్‌గా తమ దంపతుల పేర్లే రాసింది సుశీల. ఇంటి పట్టున ఉండటం వేళకి మంచి తిండి తినడం కాస్త పాత బట్టా మంచిగానే ఉన్న బట్టల్ని కట్టుకోవడంతో రామం రంగుదేలి మంచి నిగారింపుకొచ్చాడు. తెలీని వాళ్లు రామంని సుశీల వాళ్ల పిల్లవాడే అనుకొనే వాళ్లు.

చూస్తుండగా రోజులు గడిచాయ్. ఇంటర్ పాసైన రామం ప్రైవేట్‌గా డిగ్రీ చేయటం వాటితోపాటు కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాసి, సెగ్గి క్లర్క్ పోస్ట్ సంపాదించుకున్నాడు.

"ఆ వచ్చిన ఉద్యోగమేదో ఇక్కడొచ్చినా బావుండేది. ఇప్పుడు మిమ్మల్ని వదిలి ఆ బెంగుళూర్ వెళ్లాలంటే బాధగా ఉందమ్మా. పోనీ ఇది వదిలేసుకోనా" అని రామం అంటే

"వినోద్ జాబ్ రాగానే బాంబే వెళ్లలేదూ? పిచ్చాడిలా మాట్లాడకు. జాబ్ రావడమే ఎంతో అదృష్టం. దాన్ని మా గురించి వదులుకుంటానంటావేంటి? వెళ్లి జాబ్‌లో చేరు. లీవ్ దొరికినప్పుడల్లా వస్తూ ఉండు" అంటూ ధైర్యం చెప్పి రామంని పంపించారు సుశీల, రాఘవరావ్.


దాంతో అయిష్టంగానే బెంగుళూర్‌కి వెళ్లాడు రామం. నాల్రోజులకోసారి తప్పకుండా ఫోన్ చేసేవాడు. 'వాడు తన మొదటి జీతం తీసుకొని ఎంతో ఆనందంతో వచ్చే సమయానికే ఇలా జరగాలా?' అనుకుంది సుశీల, గతం నుండి వర్తమానంలోకి వస్తూ.

తలుపు చప్పుడవ్వడంతో చటుక్కున లేచింది సుశీల. ఎదురుగా రాఘవరావ్. అలవాటుగా చల్లటి మంచినీళ్లు తెచ్చి అందించింది. మౌనంగానే వాటినందుకొని తాగి ఖాళీ గ్లాసుని ఆమె చేతికిచ్చాడు. గ్లాసు విసిరికొట్టనందుకు మనసులోనే ఊరడిల్లింది సుశీల. ఆమె మొహంలోకి చూడకుండా గోడకి చెప్పినట్లుగా "నిన్న రాత్రంతా ఆలోచించాను. ఇప్పుడు మనం విడిపోయి విడాకులు తీసుకుంటే ఇంటి పరువు రచ్చకెక్కేదేగాక పిల్లల భవిష్యత్తు పాడైపోతుంది. కాబట్టి ఒక నిర్ణయానికొచ్చాను. ఇకమీదట మనం ఒక కప్పు కింద నివసిస్తున్న అపరిచితులం. మనమధ్య ఇక ఎలాంటి సంబంధం ఉండదు" అని చెప్పి బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు రాఘవరావ్.

అంతవరకూ తను ఇల్లు వదిలి పిల్లల్ని వదిలి ఎలా ఉండటం ఏం చేయటం అన్న టెన్షన్‌తో ఉన్న సుశీలకు ఆ మాటలు కాస్తంత ఓదార్పునిచ్చినా, 'నిన్ను వదిలి నిమిషం అయినా ఉండలేనని' భర్తనోట 'మనకెలాంటి సంబంధం లేదు' అని వినాల్సి వచ్చినందుకు తల్లడిల్లిపోయింది.

ఆనంద్ ఓ ప్రైవేట్ ఫరమ్‌లో కంప్యూటర్ ట్యూటర్‌గా చేస్తున్నాడు నాగపూర్‌లో. అక్కడికి తను వెళ్లినా ఆ పరిసరాల్లో ఇమడలేదు. భాష సమస్యొకటి. పోనీ వినోద్ దగ్గరికి వెళ్లిపోదామా అన్నా అదే సమస్య.

ఇంతలో అపురూప రావడంతో రాఘవరావ్ ఆ పిల్ల చెప్పే కబుర్లని వింటూ కూర్చున్నాడు. తన ఎక్స్‌కర్షన్ ముచ్చట్లన్నీ చెప్పి అపురూప వెళ్లిపోగానే మళ్లీ నిశ్శబ్దం అలుముకొంది. 'వినోద్ ఉంటే బావుండే



దేమో' అని ఒకసారి 'సునంద్ వచ్చినా బాగుండేది' అని ఒకసారి 'రాకపోవడమే నయం వస్తే వాళ్లకి తమ పట్ల అనుమానం కలిగి ఉండేది' అని మరోసారి అనుకొంది సుశీల. ఆనంద్ వచ్చినా ఎప్పుడూ కంప్యూటర్‌తోనే, టీవీ తోనే బిజీగా ఉంటాడు కాబట్టి అంతగా పట్టించుకోడు. కానీ రామం వస్తే ఎలా? వాడి ముందు తాను మామూలుగా ఎలా ఉండాలి? అన్నది తలుచుకుంటే- ఇంకా రాఘవరావ్, రామం పట్ల ఇప్పుడెలా స్పందిస్తాడోనని ఊహించుకుంటే మాత్రం సుశీలకి నిద్రపట్టేది కాదు.

★ ★ ★

"రాఘవా రాఘవా" అంటూ కంగారుగా వస్తున్న అనంతాన్ని చూస్తూ "ఏమయింది" అంటూ ఒకేసారి సుశీల, రాఘవరావ్ అడిగారు. ఒక్కసారిగా బావురుమన్నాడు అనంతం.

"అపురూప ఇంకా ఇంటికి రాలేదురా. మాకు చాలా కంగారుగా ఉంది, శ్యామలైతే ఏడ్చేస్తోంది" అన్నాడు గొంతు పెగుల్చుకొని అనంతం.

"అరె. ఈ విషయం ఇప్పుడా చెప్పడం. ఇద్దరం చెరో వైపు వెళ్లి వెదుకుదాం పద" అంటూ లుంగీ మీదనే బయల్దేరాడు రాఘవరావ్. సుశీల శ్యామలను ఓదార్చేందుకు ధైర్యం చెప్పేందుకు, అపురూప వాళ్లింటికి వెళ్లింది.

అర్థరాత్రవుతున్నా జాడ తెలీలేదు. పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలో వద్దో తేల్చుకోలేకపోయారు. ఆ రాత్రంతా వారికి నిద్రలేదు.

నాలుగు గంటలన్నా కాకముందే వెలుగింకా రాకముందే రాఘవరావ్ మళ్లీ తన బైక్‌మీద వెళ్లాడు. ఐదవుతూండగా ఇంటి ముందు ఆటో ఆగింది. అందులోంచి రాఘవరావ్ దిగి, నలుదిక్కులా పరకాయించి చూసి ఎవరూ లేరని నిర్ధారించుకున్నాక, స్పృహలో లేని అపురూపని భుజాన వేసుకొని ఒక్కంగలో లోపలికి వచ్చాడు. ఎవరేం చెప్పనక్కరలేకుండానే తెలిసిపోయింది అపురూప మీద ఎవరో అఘాయిత్యం చేసినట్లు. ఆ పిల్ల బుగ్గలమీద ఉన్న గాట్లు, ఫ్రాక్‌కి అంటిన రక్తపుమరకలతో.

ఘొల్లుమంటున్న శ్యామల నోరు మూసేశాడు రాఘవరావ్ చొరవగా.

"ఎవరూ ఏ సీన్ క్రియేట్ చేయకండి. నలుగురికీ తెలుస్తుంది. అనంతం నువ్వెళ్లి మన విద్యా డాక్టర్‌ని వెంట బెట్టుకొచ్చేయ్" అన్నాడు.

"ముందు మనం పోలీసులకు కబురు చేద్దామా" అన్నాడు గొంతు పెగల్చుకొని అనంతం. అతని కళ్ల వెంట ధారలుగా కన్నీళ్లు.

"పిచ్చేడిలా మాట్లాడకు. పోలీసులు వస్తే ఊరుకొంటారా మన చిట్టితల్లి గురించి పేపర్లలో వస్తుంది. న్యాయం జరిగేదేమో గానీ మన చిట్టితల్లి భవిష్యత్తు నాశనం అవుతుంది. ఎవరూ ఎవరికి ఏమీ చెప్పనక్కర్లేదు" అన్నాడు అందరినీ ఉద్దేశించి రాఘవరావ్.

అరగంటలో డాక్టర్‌తో తిరిగి వచ్చాడు అనంతం. ఆమె అపురూపని పరీక్షించి రేప్ జరిగినట్లు నిర్ధారించింది. అపురూపకైన గాయాలకు ఆయింట్‌మెంట్ రాసింది. ఆమె వారి ఫామిలీ ఫ్రెండ్ కావటంతో ఆమె కళ్లూ చెమ్మగిల్లాయ్.

సుశీలకైతే శ్యామలను పట్టుకోతరం కావటం లేదు. పావుగంట తర్వాత మెలకువ వచ్చిన అపురూప అనంతాన్ని చూస్తూనే బెదరి పిచ్చిగా అరవడం మొదలెట్టింది. రాఘవరావ్ వెళ్లినా వణికిపోసాగింది. అప్పుడు మాత్రం రాఘవరావ్ ఒక్కసారిగా ఏడ్చేశాడు. విద్య, వాళ్లని పక్క రూమ్‌లోకి పంపించేసి, అపురూపని దగ్గరకు తీసుకొని వెన్ను రాసి మెల్లగా ధైర్యం చెప్పింది. "పాప పట్ల నేను చెప్పినట్లు ప్రవర్తించండి" అంటూ జాగ్రత్తలు చెప్పి వెళ్లిపోయింది విద్య.

నాల్రోజులు గడిచాకగానీ ఈ లోకంలోకి రాలేదు అపురూప. భయం వల్ల వచ్చిన జ్వరం తగ్గుముఖం పట్టింది.

ఆ పూటకి వంట చేసి వాళ్లకి పెట్టి ఇంటికొచ్చింది సుశీల. తన దగ్గరకు ఎంతో చనువుగా, చొరవగా వచ్చే అపురూప తన వంక భయంగా చూడడాన్ని మరిచిపోలేకపోతున్నాడు రాఘవరావ్. అతనికి అదెంతో నరక సదృశంగా ఉంది. నాల్గురోజులు గడచినా మరిచిపోలేకపోతున్నాడు.

"అంత పసిదాని మీద అఘాయిత్యం చేయటానికి ఆ మృగాలకెలా మనసు ఒప్పిందో" అన్నాడు రాఘవరావ్ సుశీల రాగానే.

వారం రోజుల తర్వాత తనకై తను సుశీలతో మాట్లాడిన మాట అది. తలెత్తి చూసింది సుశీల. భర్త ఎప్పట్లా తనతో మాట్లాడ్డంతో ఆమె కంటివెంట కన్నీరు వరదలా వచ్చింది.

ఆమె మనసుని గ్రహించినట్లే దగ్గరికి వచ్చి "సుశీ! నన్ను మన్నించు. నీ మనసుని బాగా కష్టపెట్టానిన్ని రోజులు. మూర్ఖుడిలా ప్రవర్తించాను. నా కళ్లు తెరుచుకున్నాయ్. నా చేతుల్లో పెరిగిన పిల్ల మీద జరిగిన అఘాయిత్యానికే నేను తట్టుకోలేకపోయాను. ఆ విషయం ఎవరికీ తెలీకుండా జాగ్రత్త పడ్డాను. అలాంటిది కన్నకూతురైన నీ విషయంలో మీ అమ్మానాన్నలు ఎంతగా బాధపడ్డారో గ్రహించాను. ఏ తల్లిదండ్రులయినా ఎలా స్పందిస్తారో అర్థమైంది. నాకీ విషయంలో జ్ఞానోదయం కలగడానికే భగవంతుడు చిట్టితల్లిని ఎన్నుకోలేదు గదాని తల్లడిల్లిపోతున్నాను. నన్ను క్షమించు సుశీ! మన ముప్ఫై ఏళ్ల దాంపత్యంలో నువ్వేంటో ఎలాటి దానివో తెలిసీ నిన్ను వెలివేసినందుకు" అన్నాడామె చేతుల్ని పట్టుకొంటూ.

"అంత మాటొద్దు. మీ స్థానంలో నేనున్నా అలాగే ప్రవర్తించి ఉండేదాన్నేమో. ఏ భర్తా శీలం కోల్పోయిన భార్యని భరించలేడు. మీరింకా నయం తన్ని తగలెయ్యలేదు. విశాల హృదయంతో ఇంకా ఈ ఇంట్లో ఉండనిచ్చారు" అంది రుద్ధస్వరంతో సుశీల.

"విశాల హృదయం అంటూ పొగడకు సుశీ! నిజానికి నిన్ను ఇంట్లోంచి వెళ్లగొడదామనే, మహా కోపంతో మనింటికి వస్తున్నప్పుడు, నాకు తెలిసిన జంట కనిపించారు. వాళ్లెంతో అన్యోన్యంగా, సుఖశాంతులతో ఉన్నట్లు వారి మాటలే చెప్పాయ్. నాకది ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది" అంటూ ఆగాడు రాఘవరావ్.

భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండటంలో వింతేముంది? అన్నట్లుగా చూసింది సుశీల.

"అసలు సంగతేంటంటే, ఆమె వాళ్ల పెళ్లయిన ఐదేళ్లకు, భర్తను ఇద్దరు పిల్లల్ని వదిలేసి, సినిమా పిచ్చితో, వాళ్ల ఎదురింటాయనతో లేచిపోయింది. చాలా కాలం, అతను పిల్లలకు తల్లీతండ్రిగా మారి ఒక్కడే పనులు చేసుకోవడం నాకు తెలుసు. రెండో పెళ్లి చేసుకోమని ఎందరు చెప్పినా వినలేదు. అలాంటిది ఆ భార్య ఎందరో చేతులు మారి, క్షమించమంటూ తిరిగి రాగానే, ఎంతో ఔన్నత్యంతో ఆమెను క్షమించి తన జీవితంలోకి రానిచ్చాడు చూడు. అదే నన్ను ఆలోచించేలా చేసింది. కడిగిన తర్వాత తామరపూలని దైవార్చనకు వాడుతున్నారు. అలాంటిది పొరపాటున బురదలో పడిన ముత్యం లాంటి నిన్ను, మంచు వంటి క్షమాపణతో ప్రక్షాళనం చేస్తే ప్రకాశించవూ.. మంచు కడిగిన ముత్యం లాంటి నిన్నిక ఎప్పటికీ చేజార్చుకోను" అన్నాడు రాఘవరావ్ ఆమెను దగ్గరకు తీసుకుంటూ. "ఎవరో అల్పుడి మాటలు విని భార్యనొదులుకున్న ఆ రాముడి కన్నా మీరే ఎంత ఉన్నతులండీ" అంది సుశీల ఆనందోద్వేగాలతో.

"ఆ దేవుడికన్నా నేనే ఎక్కువని అనకు. నేను చాల్లా సామాన్యుణ్ణి. మన పిల్లలకు నేనే ఈ సంగతులు మెల్లిగా వివరిస్తాను. మనకీ రోజు నుండి రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల్లా నల్గురు కొడుకులనుకొంటే సరి. మరిచా.. కూతురుగూడా" అన్నాడు రాఘవరావ్ నవ్వుతూ.

దాంతో సుశీల మనసు దూదిపింజెలా తేలికయింది.

